TELTEL/12233

# మన ప్రజాప్రతినిధి
దినపత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మన ప్రజా ప్రతినిధి దినపత్రికకు, టీ.వి ఛానల్ కు జిల్లాల వారిగా, స్టాఫ్ రిపోర్టర్ మరియు మండలాలకు రిపోర్టర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను అనుభవం ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి 7382966665 7382566600

ఎడిటర్ : జి.శ్రీనివాస్ సంపుటి : 2 సంచిక : 31 ఆదివారం, నవంబర్ 24 2024, పేజీలు - 4 వెల : 2/-

https://epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM : TELANGANA / ANDHRAPRADESH

## మహాయుతి కూటమి చరిత్రాత్మక విజయం..

ఢిల్లీ, నవంబర్ 23 :మహారాష్ట్ర, జారండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలో మహాయుతి కూటమి విజయంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన ప్రజ లకు ధన్యవాదాలు తెలిపారు.మహారాష్ట్రలో అభివృద్ధి, సుపరిపా లనలు గెలిచాయని.. ప్రజల అభివృద్ధి, అభ్యున్నతి కోసం మహాయుక్తి కూటమి ప్రభుత్వం ఇదే విధంగా పనిచేసే స్తుందని స్పష్టం చేశారు.మరోవైపు.. జారండ్‌లో అధికారం దక్కించుకున్న ఇండియా కూటమికి ప్రధాని అభినందనలు చెప్పారు. బీజేపీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తను చూసి గర్వపడుతున్నట్లు నరేంద్ర మోదీ వెల్లడించారు.



## ఇది ప్రజల విజయం : ప్రియాంక గాంధీ

వయనాడ్,నవంబర్ 23 :కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వయనాడ్‌లో భారీ విజయం సాధించారు. తన అభ్యర్థిపై ఏకంగా 4.04 లక్షలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు. వయనాడ్ నుంచి మొదటిసారిగా పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసిన ప్రియాంక గాంధీ ఇలా భారీ మెజార్టీతో గెలవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ తన గెలుపుపై ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రజలు తనపై చూపించిన విశ్వాసంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయాన్ని ప్రజల విజయంగా అభివర్ణించారు. పార్లమెంటులో మీ తరవున తన గళాన్ని విప్పుతానని పేర్కొన్నారు. తన ప్రచారం కోసం పనిచేసిన యూడీఎఫ్‌లోని సహచరులు, కేరళలోని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తల్లి సోనియా గాంధీ, భర్త రాబర్ట్ వద్రా ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేనిదంటూ కొనియాడారు.



## ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులు

- మహారాష్ట్రలో రేవంత్ పప్పులు ఉడకలేదు
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన కెటిఆర్



హైదరాబాద్,నవంబర్ 23 : దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులనే విషయం మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఫలితాలతో తేలిపోయిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని కాంగ్రెస్ దేశంలో ప్రాంతీయ పార్టీలను నాశనం చేస్తోందని ఆక్షేపించారు.

వివరాలు 2లో

## వయనాడ్‌లో భారీ విజయం సాధించిన ప్రియాంక

- తొలిసారి లోక్‌సభలో అడుగుపెడుతున్న చెల్లి
- అన్న రాహుల్ మెజార్టీని దాటేసి రికార్డ్ మెజార్టీ
- రికార్డె మెజార్టీపై సిఎం రేవంత్ హర్షం



వయనాడ్,నవంబర్ 23 : కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ తొలి అడుగులోనే విజయఢంకా మోగించారు. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో భారీ విజయాన్ని దక్కించుకున్నారు. ఈ స్థానంలో తన సమీప అభ్యర్థిపై 3.94లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. దీంతో అన్నా చెల్లెల్లిద్దరూ లోక్‌సభ సభ్యులయ్యారు. తల్లి సోనియా ఇప్పటికే రాజ్యసభలో ఉన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన 3.64లక్షల ఓట్ల మెజార్టీని ప్రియాంక దాటేశారు. వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3 లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. సీపీఐ

వివరాలు 2లో



## మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను తిప్పికొట్టారు

**తెలంగాణలోనూ వ్యతిరేకత వస్తోంది: బండి**

కరీంనగర్,నవంబర్ 23 : తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల విసుగు చెందారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ యుద్ధం ప్రకటించబోతోందన్నారు. మహారాష్ట్రలో ఎన్ని అబద్దాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ కూటమిని నమ్మలేదన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల

వివరాలు 2లో

## హైదరాబాద్ తాగునీటి అవసరాలపై దృష్టి

- కార్యాచరణ రూపొందించాలని ఆదేశం
- అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్



హైదరాబాద్,నవంబర్ 23 : హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీ ల గోదావరి జలాల తరలింపు పైన ముఖ్యమంత్రి సమీక్షించారు.. తన నివాసంలో జలమండలి, ఇరిగేషన్ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపు పైన సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఏ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపునకు ఎంత వ్యయం అవుతుంది,

వివరాలు 2లో

## రూ.18.27కోట్ల దీపావళి బోనస్

- సింగరేణి రిటైర్డ్ కార్మికులకు దీపావళి బోనస్
- ఈ నెల 27న ఖాతాల్లో జమ
- సింగరేణి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ వెల్లడి




హైదరాబాద్,నవంబర్ 23 : సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన దీపావళి బోనస్ రూ.18.27కోట్లు ఈ నెల 27న ఖాతాల్లో జమ చేస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 24 మధ్య పని చేసి రిటైర్డ్ అయిన కార్మికులకు సంబంధించి పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీమ్ (దీపావళి బోనస్) సొమ్మును విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఆయా కార్మికుల ఖాతాల్లో దీపావళి బోనస్ జమవుతుందని సీఎండీ ఒక ప్రకటనలో వెల్లడించారు. దాదాపు 2,754 మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.93,750 చొప్పున మొత్తంగా రూ.18.27కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న రిటైర్డ్ కార్మికుల ఖాతాల్లో జమ చేసేందుకు

వివరాలు 2లో

## మోడీ నాయకత్వానికి అండగా మహారాష్ట్ర

- ఎన్నికల ఫలితాలపై కిషన్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్ 23 : ఏ ఎన్నిక జరిగినా బీజేపీదే విజయమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మోదీ నాయక త్వానికి అండగా నిలిచినందుకు మహారాష్ట్ర ప్రజలకు ధన్యవాదా లు తెలిపారు. మహావికాస్ అఘాడీ కూటమి విద్వేషాలు ప్రచారం చేశారని విమర్శించారు. ఎంవీఏ కూటమిని ప్రజలు నమ్మలేద న్నారు కిషన్ రెడ్డి. మహారాష్ట్ర ప్రజలు వారసత్వం చూడలేద న్నారు మహారాష్ట్రలో ఎన్డీయే కూటమికి ఓట్లు, సీట్లు భారీగా పెరి గాయన్నారు కిషన్ రెడ్డి. శరద్ పవార్ శకం ముగిసిం దన్నారు. కాంగ్రెస్ కులం,మతం పేరుతో ప్రచారం చేసిందని.. మహారాష్ట్ర, జార్ఖండ్ లో కలిపి కాంగ్రెస్ కు 30 సీట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు కిషన్ రెడ్డి. కాంగ్రెస్ పై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు. మహారాష్ట్రలో సీఎం ఈవీఎం కుట్ర అంటూ కాంగ్రెస్ కూటమి నేతలు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు కిషన్ రెడ్డి. సంజయ్ రౌత్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. ఓడి పోయినప్పుడు ఈవీ ఎంలపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్ కు అలవాటుగా మారిందని విమర్శించారు. కర్ణాటక, జార్ఖండ్, తెలంగాణలో గెలిచినప్పుడు ఈవీఎంలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు కిషన్ రెడ్డి. కాంగ్రెస్ మూడు రాష్ట్రాలకే పరిమితమైందన్నారు.



## అదానీకి యూఎస్ సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ కమిషన్ సమన్లు

- లంచం ఆరోపణలపై వైఖరిని స్పష్టంచేయాలని కోరిన కమిషన్



న్యూఢిల్లీ,నవంబర్ 23 : అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీతో పాటు ఆయన మేనల్లుడు సాగర్‌కు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ సమన్లు జారీ చేసింది. సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులను పొందేందుకు 265 మిలియన్ డాలర్ల (రూ.2,200 కోట్లు) లంచం ఇవ్వారన్న ఆరోపణలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని కమిషన్ కోరింది. అహ్మదాబాద్‌లోని అదానీ శాంతివన్ ఫామ్ నివాసానికి, అలాగే మేనల్లుడు సాగర్ బోడక్‌దేవ్ నివాసానికి సమన్లు పంపింది. ఈ నెల 21న న్యూయార్క్ ఈస్టర్న్ కోర్టు నుంచి నోటీసులు పంపింది. సమన్లు అందుకున్న 21 రోజుల్లోగా

వివరాలు 2లో

# ప్రజా సంఘాల ధర్నాను విజయవంతం చేయండి

**మన ప్రజా ప్రతినిధి తిరుపతి జిల్లా.**

26 న తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండిఏఐటియుసి. శ్రీ కాళహస్తి నియోజకవర్గ%వా% రేణిగుంట పంచాయతీ కార్మికుల కరపత్రం విడుదల చేసిన నాయకులు రైతు సంఘాల సమన్వయ సమితి (ఏపీ ఎస్ కె ఎమ్ )- కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రంలో ప్రజాసంఘాలన్నింటినీ కలుపుకొని ప్రజా సమస్యల పరిష్కార%శీ% కోసం 26వ తేదీన 26 జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద మహా ధర్నాకు పిలుపునిచ్చాయి ఈ సందర్భంగా గ్రామ గ్రామాన కర పత్రాలు పంపిణీ కార్యక్రమానికి ప్రజా సంఘాలు శ్రీకారం చుట్టాయి ఏ ఐ టి యు సి - సిపిఐ ప్రజాసంఘాల ముఖ్య నాయకుల రేణిగుంటలో కరపత్రాల విడుదల కార్యక్రమం చేశారు ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా కార్యదర్శి కేతారి రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామ గ్రామంలో ఇంటింటికి కరపత్రం చేరాలని చిన్నపాటి సమావేశాలు నిర్వహించి ఈ కార్యక్రమం ఎందుకు చేస్తున్నామో రైతాంగానికి ప్రజలకు మరీ ముఖ్యంగా మహిళలకు వివరించే కార్యక్రమం చేపట్టాలని వారు తీర్మానించడం జరిగింది - రేణిగుంట పంచాయతి లో ఇంటింటికి కరపత్రాలు పంచడం జరిగింది అలాగే పట్టణ ప్రాంతాలలో ఆటో స్టాండ్ ల వద్ద హమాలి సెంటర్ల వద్ద వాకింగ్ సెంటర్లలో వీధి వర్తక వ్యాపారం చేసుకుంటున్న కూడలి వద్ద భవన నిర్మాణ కార్మికులు ఉండే ప్రదేశాలలో



విస్తృతంగా కరపత్రాల పంపిణీకి ప్రణాళిక రూపొందించడం జరిగింది జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేయడం కోసం.. సాగు చేయడానికి కావలసిన రుణ సదుపాయం కోసం.. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కోసం ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం..

మహిళా మణులకు డ్వాక్రా రుణాలు బ్యాంకు నుండి విరివిగా ఇవ్వడం కోసం తల్లికి దీవెన అమ్మకు వందనం మహిళలకు ఆసరా పథకాల పేర్లు ఏవైనా మహిళల చేతికి డబ్బులు అందడమే ప్రధాన ఉద్దేశంతో ఈ యొక్క ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా తీసుకెళ్లడానికి ప్రణాళిక రూపొందించడం జరిగిందని వారు అన్నారు అందుకోసం 26వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం యువత విద్యార్థి మహిళ మేధావి వర్గం కళాకారులు అందరూ పెద్ద ఎత్తున కదలి రావాలి అని కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేయాలని రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాతో రాష్ట్ర ప్రభుత్వం దిమ్మ తిరిగే సమాధానం చెప్పాలని ప్రజల్లో.. ప్రభు త్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం కృషి చేయాలి అని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి వైఎస్ మణి. మోహన్ రెడ్డి మురళి జై మనీ చంద్రకళ సుబ్బరాయుడు రమణ తిరుపాలు గోవిందమ్మ గంగమ్మ తల్లి రంగా రైతుల కార్మిక నాయకులు పాల్గొనడం జరిగింది.

## డిజిపి చేతులమీదుగా రుద్రంగి ఎస్సైకి 3 రివార్డ్‌లు



**మనప్రజాప్రతినిధి//రాజన్నసిరిసిల్ల తేదీ 23 ,నవంబర్** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల ఎస్సై సిరిసిల్ల అశోక్ కు గంజాయి కేసులలో ఉత్తమ ఇన్వెస్టిగేషన్ మరియు 2020 సం. లో మరిపెడ మండల పోలీసు స్టేషన్ నందు వివిధ కేసులలో గంజాయి ని పట్టుకొని నిందితులను అరెస్టు చేయటం జరిగింది, ఆ కేసులలో 3 కేసులు 2024 సం. లో నిందితులకు శిక్ష పడినందున రాష్ట్ర డిజిపి డా జితేందర్ ఐపీఎస్ చేతుల మీదుగా శనివారం నాడు హైదరాబాద్ డీజీపీ కార్యాలయం నందు 3 ప్రశంస పత్రాలు, మరియు నగదు రివార్డ్ ను పొందినారు రుద్రంగి ఎస్ఐ సిరిసిల్ల అశోక్ కు మూడు రివార్డులు వచ్చినందుకు గాను మండల ప్రజలు అభినందనలు తెలియజేశారు

## సమాజ ప్రగతిని మార్చే శక్తి విద్యకు మాత్రమే సాధ్యమని విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసిన అనంతుల నరేందర్



**మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్..**లైఫ్ కిల్స్ వితౌట్ స్కీల్స్ బుక్స్ ను కొండపాక మోడల్ స్కూల్ లో విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ చేతుల మీదుగా శనివారం రోజు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.మిషన్ కమ్యూనికేషన్ లీడ్ లైఫ్ హ్యాపీలి మిషన్ కమ్యూనికేషన్ సంస్థల ద్వారా కోణం శ్రీకాంత్ 2023 లో ప్రారంభించారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాలలో ఉండే విద్యార్థులకు అందే విధంగా వారి నైపుణ్యం మరింత మెరుగుపడుతుందని బుక్ రూపొందించబడిందన్నారు, విద్యార్థులకు ఉచితంగా బుక్స్ ను అందించడం పట్ల అనంతుల నరేందర్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, మిషన్ కమ్యూనికేషన్ కోఆర్డినేటర్స్ పంజా రమేష్, పెద్ద0కుల దేవేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా వెల్ నెస్ రన్.. అమర్ రాజా గ్రూప్ ఉద్యోగులకు.....





**ప్రజా ప్రతినిధి రేణిగుంట మండలం.**మండలంలోని కరకంబాడిలో అమర రాజా గ్రూప్ క్యాంపస్‌లో నిర్వహించిన 'వెల్‌నెస్ రన్' ఉద్యోగుల సంక్షేమం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పే అభినందనీయమైన కార్యక్రమం. " నా ఆరోగ్యం, నా బాధ్యత" అనే నినాదంతో, ఆరోగ్యం పట్ల అమిత శ్రద్ధ చూపవలసినదిగా ఉద్యోగులను ప్రోత్సహించింది, వ్యక్తులు వారి స్వంత ఆరోగ్యం,శ్రేయస్సులో చురుకైన పాత్ర పోషించాలనే ఆలోచనను చాటి చెప్పారు.ఈ ఈవెంట్ 3 కి.మీ, 5 కి.మీ పరుగులో పాల్గొన్న 1000 మందికి పైగా ఉద్యోగులను ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో చిన్న వార్మప్ సెషన్‌తో ప్రారంభమయ్యాయి, ఆ తర్వాత ఏ ఆర్ జి సి %-% నూనెగుండ్లపల్లిలో మునీశ్వర నాయుడు,ఏ ఎస్ బి యు ఆపరేషన్స్ హెడ్, హెడ్ ఆఫీస్ - కరకంబాడిలో బిజినెస్ ఫైనాన్స్ హెడ్ సతీష్ కుమార్,కిషన్ కోన, ఎస్ బి యు హెడ్ టూల్‌వర్క్స్ - జెండాను ఊపి వెల్‌నెస్ రన్‌ను ప్రారంభించారు. ఈ రన్ లలో పాల్గొన్న వారందరికీ పతకాలు పంపిణీ చేశారు.మారథాన్ అనేది వార్షిక వెల్‌నెస్ క్యాలెండర్‌లో ఒక భాగం. ఇది శారీరక శ్రమ, మానసిక ఆరోగ్యం మరియు ఉద్యోగుల క్షేమం, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే సంస్కృతికి దోహదం చేస్తుంది. ఇక్కడ నిర్వహించిన వెల్‌నెస్ రన్ ఉద్యోగుల్లో శారీరక ఆరోగ్యం మరియు శ్రేయస్సును పెంపొందించే విజయవంతమైన కార్యక్రమం. వివిధ విభాగాలు మరియు విభిన్న సమూహాల నుండి పాల్గొనేవారు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా, అమర రాజా గ్రూప్ చురుకైన జీవనశైలిని ప్రోత్సహించడం, ఒత్తిడిని తగ్గించడం మరియు ధైర్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. పాల్గొనేవారి నుండి వచ్చిన అభిప్రాయం ఆరోగ్యకరమైన అలవాట్లను నిర్వహించడానికి వారి ప్రేరణపై సానుకూల ప్రభావాన్ని పెంపొందించింది మరియు ఆహ్లాదకరమైన, సహకార వాతావరణంలో పాల్గొనడం ద్వారా ఆనందాన్ని పొందినారు. మొత్తంమీద, వెల్‌నెస్ రన్ విజయవంతమైనది, ఉద్యోగుల ఆరోగ్యం పట్ల సంస్థ యొక్క నిబద్ధతను బలోపేతం చేయడం మరియు రోజువారీ జీవితంలో సంక్షేమంను చేర్చడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం జరిగినది.

## అంగన్వాడి సెంటర్లకు కుర్చీలు బహుకరణ చేసిన మాజీ ఏఎంసీ చైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్




**మన ప్రజా ప్రతినిది తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట 23-11-2024,** మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామంలో చేగుంట తాజా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్ . తన సొంత గ్రామం లో నాలుగు అంగన్వాడి సెంటర్ల లో చిన్నారులకు మొత్తం 80 చైర్లు వడియారం గ్రామంలో తన వంతు సహాయంగా చేర్లను బహుకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు ఆకులమల్లేశం.అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన దుబ్బాక ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**మన ప్రజా ప్రతినిది తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట నవంబర్ 23** అర్హులైన లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిది లోని బోనాల గ్రామ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,జనరల్ సెక్రటరీ కొండి శ్రీనివాస్,మాజీ ఎంపీపీ మసుల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ కాషాబోయిన భాస్కర్,పట్టణ యూవ నాయకులు సంద్రుగు శ్రీకాంత్,దుబ్బాక యూత్ అధ్యక్షులు సాయికుమార్ గౌడ్,అమర్ రెడ్డి,సోలిపేట ప్రసాద్ రెడ్డి, పద్మ రెడ్డి,ఓబీసీ అధ్యక్షులు అన్నం ఆంజనేయులు, ఎస్టీ సెల్ అధ్యక్షులు ఫకీర్ నాయక్, ఎస్సి సెల్ అధ్యక్షులు నర్సిములుమండల ఫిషర్ అధ్యక్షులు సోమా వెంకటేష్,,సినియర్ నాయకులు మొజామిల్, మహేష్,వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వయనాడ్‌లో భారీ విజయం సాధించిన ప్రియాంక

(మొదటి పేజీ తరువాయి)

నాయకురాలు అన్నీ రాజాపై 3.64 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాయ్‌బరేలీలోనూ విజయం సాధించడంతో ఆ తర్వాత ఈ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్య మైంది. అనంతరం ప్రియాంక రంగంలోకి దిగారు. ఝార్ఖండ్ తొలి విడత ఎన్నికలతో పాటుగా నవంబర్ 13న ఈ స్థానంలో పోలింగ్ జరిగింది. వయనాడ్ ఉప ఎన్నికల్లో యూడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రియాంక గాంధీ రికార్డు మెజారిటీతో ప్రభంజనం సృష్టించారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ పేరిట నమోదైన మెజారిటీ రికార్డును ప్రియాంక బద్దలు కొట్టారు. శనివారం మధ్యాహ్నం వయనాడ్‌లో ప్రియాంక గాంధీ మెజారిటీ 3 లక్షల 77 వేల 517 ఓట్లు దాటింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీకి వయనాడ్‌లో 3,64,422 ఓట్ల మెజారిటీ దక్కింది. ఈ రికార్డును బద్ధలు కొట్టి అన్న మెజారిటీ రికార్డును తిరగరాసిన చెల్లిగా ప్రియాంక గాంధీ నిలిచింది. అన్ని రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యే సమయా నికి వయనాడ్‌లో ప్రియాంక గాంధీకి 4 లక్షల మెజా రిటీ దక్కొచ్చనే అంచనాలున్నాయి. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీకి ప్రజలు రికార్డు స్థాయిలో విజయాన్ని అందిస్తారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం రేవంత్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. వయనాడ్ ప్రజలు ఆమెకు రికార్డు స్థాయి విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఘన విజయంతో తొలిసారిగా ప్రియాంక గాంధీ పార్లమెం టులో అడుగుపెట్టబోతున్నారని వ్యక్తం చేశారు.

## ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులు

(మొదటి పేజీ తరువాయి)

చేసింది.'కాంగ్రెస్ చేతగానీ, అసమర్థత కారణంగానే భాజపా మనుగడ కొనసాగుతోంది. ప్రాంతీయ పార్టీల కృషిని విస్మరిస్తూ జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపాలు సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం ఘోర ఓటమి నుంచి కాంగ్రెస్‌ను కాపాడలేకపోయింది. ఆయన అసత్య ప్రచారాన్ని మరాఠా ప్రజలు నమ్మలేదు. ఇకనైనా తెలంగాణలో గెలిపించిన ప్రజల కోసం, వాళ్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చటం కోసం రేవంత్ పనిచేయాలి. ఏడాది క్రితం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుపై దృష్టి పెట్టాలి. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలనే కుట్రలో కాంగ్రెస్ ఎక్కువ కాదు.. భాజపా తక్కువ కాదు'అని కేటీఆర్ పేర్కొన్నారు.

## మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను తిప్పికొట్టారు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో కరీంనగల్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కూటమి ముక్కలు కావడం ఖాయమన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మొదలుకాబోతున్నాయని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేలే కూలుస్తారని స్పష్టం చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా మహారాష్ట్రలో పట్టిన గతే పడుతుంది. ఎందుకంటే ఒక్క హామీలను అమలు చేయలేదు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

## హైదరాబాద్ తాగునీటి అవసరాలపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

నీటి లభ్యత పైన పూర్తి అధ్యయనం చేయాలని సూచన..చేశారు. వచ్చే నెల 1వ తేదీ వరకు టెండర్లకు వెళ్లేలా కార్యచరణ రూపొ ందించాలన్న సీఎం అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకో వాలన్నారు. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకో వాలని సూచించారు.

## రూ.18.27కోట్ల దీపావళి బోనస్

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆర్థిక, సిబ్బంది వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

## అదానీకి యూఎస్ సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ కమిషన్ సమన్లు

(మొదటి పేజీ తరువాయి)

సమాధానం ఇవ్వాలని చెప్పింది. అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌతమ్ అదానీ అమెరికన్ ఇన్వెస్టర్లను మోసం చేశారని, ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చినట్లు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఆరోపించిన విషయం తెలిసిందే.

## రైతుల పక్షాన పోరాటానికి జైలు

- పట్నం మహేందర్ రెడ్డికి కెటిఆర్ పరామర్శ

**హైదరాబాద్,నవంబర్ 23 :**బలహీనవర్గాల రైతుల తరపున పోరాటం చేసిన పాపానికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జైల్లో గడపాల్సి వస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. చర్లపల్లి జైలులో ఉన్న నరేందర్‌రెడ్డితో ములాఖత్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. '30 మంది అమాయక రైతులను జైల్లో పెట్టారు.. వాళ్ల కోసం పోరాటం చేయండి. ఫార్మా విలేజ్‌ను ప్రజలపై రుద్దుతున్నారని.. అక్కడి పేదల పక్షాన పోరాడాలని ములాఖత్ సందర్భంగా పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారు. భూములు ఇవ్వం అన్నందుకు.. కాంగ్రెస్ కార్యకర్తలు ఇష్టం వచ్చినట్టు అరాచకాలు చేస్తున్నారు. కొడంగల్‌లో సర్పంచ్‌గా పనిచేసిన వ్యక్తి.. కాంగ్రెస్ పాలనలో అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన ఇంటికి అడ్డంగా గోడ కట్టి దారి లేకుండా చేస్తే అవమానం భరించలేక క్షోభతో బలవన్మరణానికి పాల్పడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి చక్రవర్తి, నియంత కాదు. సొంత నియోజకవర్గమైతే అదేమైనా మీ సామ్రాజ్యమా ?నాడు శిశు పాలుని పాపాలు లెక్క పెట్టినట్టు.. నేడు రేవంత్ పాపాలను ప్రజలు లెక్క పెడుతున్నారు. భూ కుంభకోణాలు, ఫార్మా విలేజ్ పేరిట దౌర్జన్యాలు చేస్తున్నారు.

## కర్నటకలో కాంగ్రెస్ జోష్

- ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన సిఎం సిద్దరామయ్య

**బెంగళూరు,నవంబర్ 23 :** కర్ణాటకలో మూడు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. శిగ్గావ్, సండూరు, చెన్నపట్నలలో ఆ పార్టీ అభ్యర్థుల విజయంపై సీఎం సిద్ధరామయ్య హర్షం వ్యక్తం చేశారు. మూడు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించిన ప్రజలకు 'ఎక్స్' వేదికగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విపక్షాలు నిరంతరం దూషణలు, తప్పుడు ఆరోపణ లకు ఎదురొడ్డి సాధించిన ఈ విజయం ఓ అద్భుతంలా కనబడుతోందన్నారు. ఈ సమయంలో ఈ విజయానికి కృషిచేసిన కార్యకర్తలు, నేతలను అభినందించారు. ఈ గెలుపుతో ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ ఫలితాలు ప్రజల కోసం పనిచేయాలనే తమ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయన్నారు. కర్ణాటకలోని చెన్నపట్నలో జేడీఎస్ అభ్యర్థి, మాజీ సీఎం కుమారస్వామి తనయుడు నిఖిల్ కుమారస్వామిపై.. శిగ్గావ్, సండూరు స్థానాల్లో భాజపా అభ్యర్థులపై కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మూడు స్థానాలను మూడు ప్రధాన పార్టీలు గెలుచుకున్నవే. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శిగ్గావ్‌లో భాజపా అభ్యర్థి బసవరాజ బొమ్మై, చెన్నపట్నలో జేడీఎస్ అభ్యర్థి కుమారస్వామి, సండూరులో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం అప్పట్లో గెలిచారు.

## తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

- మరో 26 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

**హైదరాబాద్,నవంబర్ 23 :** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా.. మరో 26 నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేసింది. ప్రిన్సిపల్ సెక్రెటరీ బీ.వెంకటేశం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. బోధన్, పెద్దపల్లి, డోర్నకల్, సత్తుపల్లి, వైరా, కోదాడ, కొత్తగూడెం, నకిరేకల్, నాగార్జున సాగర్, తాండూరు, మక్తల్, రామగుండం, నారాయణ్ పేట, జుక్కల్, చొప్పదండి, కల్వకుర్తి, నిజామాబాద్ రూరల్, వనపర్తి, చేవేళ్ల, జగిత్యాల, వికారాబాద్, గద్వాల, ధర్మపురి, మెదక్, మేడ్చల్, ఆర్మూరు నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు అయ్యాయి.

# ముస్తాబాద్ లో ప్రజాపాలన కళా యాత్ర



**మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల నవంబర్ 23 :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ ల పై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజాపాలన కళా యాత్ర తేది 19-11-2024 నుండి 07-12-2024 వరకు 19 రోజులు చేపట్టిన కళా యాత్ర శనివారం రోజు ముస్తాబాద్ మండల కేంద్రం,పోతుగల్, అవునూర్ లో జరిగింది, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, యువతకు 56 వేల ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కె దక్కుతుంది గృహజ్యోతి కింద పేదలకు 200 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకు సిలిండర్, ఆరోగ్య శ్రీ కార్డ్ 5లక్షల నుండి 10లక్షల రూపాయలవరకు పెంచడం జరిగింది, రైతులకు ఎకకాలంలో 2లక్షల రుణ మాఫీ చేసిన ముఖ్యమంత్రి,స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగింది,మహిళా శక్తి క్యాంటీన్ ల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని వారికీ ఆర్థిక సహాయం అందించడం జరుగుతుంది, నైపుణ్యత ఉన్న యువత అన్ని రంగాల్లో రాణి%శీ%చాలని స్కిల్ యూనివర్సిటీ తో పాటు ఆటల్లో రాణి%శీ%చాలని స్పోర్ట్స్ యూనివర్సిటీ ని రాష్ట్రము లో ప్రారంభం చేయడం జరిగింది ప్రభుత్వం ఏర్పడిన మొదటి స%శీ%వత్సరములో విజయవంతంగా పూర్తి చేసిన ప్రజాప్రభుత్వం ప్రభుత్వ విజయాలపై సాంస్కృతిక సారథి కళాకారుల ప్రజాపాలన కళాయాత్ర, ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం టీం లీడర్ ఎడమల శ్రీధర్ రెడ్డి, కళాకారులు పొత్తూరి రాజు, శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, వంతడుపుల గణేష్, గుగ్గిళ్ళ పరుశరాములు, పూదూరు సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, అంతడుపుల లావణ్య, కిన్నెర శ్రీలత, అనుముల శిరీష, ఆయా గ్రామాల ప్రజలు పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చేత ట్రాఫిక్, రోడ్ భద్రత నియమలపై ఫ్లాష్ మాబ్

**సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ.**




**మనప్రజాప్రతినిధి/రాజన్నాసిరిసిల్ల** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గారి ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌక్ వద్ద ఈ రోజు శ్రీ చైతన్య స్కూల్ కి చెందిన విద్యార్థుల చేత ఫ్లాష్ మాబ్ కార్యక్రమం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియమలు ,రోడ్ ప్రమాదాల నిర్మూలనకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలియజేస్తూ అవగాహన కల్పించడం జరిగింది.ఫ్లాష్ మాబ్ కార్యక్రమంలో ప్లాకార్డ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరిని ఆకట్టుకున్నాయి.అనంతరం సి.ఐ మాట్లాడుతూ... ప్రతి వాహన దారుడు ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, బయటకు వెళ్ళిన తన కోసం కుటుంబ సభ్యులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటరన్న విషయాన్ని వాహన దారులు గుర్తించాలని, అనుకొని ప్రమాదాల వల్ల కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని కావున వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు.ప్రతి వాహన దారుడు తప్పకుండా హెల్మెట్, షీట్ బెల్ట్ ధరించాలని , అతి వేగం, ర్యాస్ డ్రైవింగ్, మద్యం త్రాగి డ్రైవింగ్ చేయటం, మొబైల్స్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయటం వంటివి చేయవద్దని,రాంగ్ రూట్ లో వాహనాలు నడుపవద్దని ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ ,రోడ్ భద్రత నియమాలు పాటించాలి అన్నారు. సి.ఐగారి వెంట ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఉన్నారు.

# తంగళ్ళపల్లి పీ ఎస్ ను ఆకస్మిక తనిఖీచేసినజిల్లాఎస్పీ



**మనప్రజాప్రతినిధి/రాజన్నాసిరిసిల్ల:** రాజన్నసిరిసిల్లజిల్లా తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ శనివారం రోజున జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని,ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు బ్లూ కోల్ట్ ,పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటు పై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా అధికారులు,విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతు ప్రజలకు చట్టాల మీద, డయల్100,షీ టీమ్స్, సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల మీద అవగాహన కల్పించాలని అన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు ఎస్పీ గారి వెంట సి.ఐ మొగిలి,ఎస్.ఐ రామ్మోహన్,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# క్రీడారంగం అభివృద్ధిపైనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టి

**క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కృషి**
**క్రీడాప్రోత్సాహకాలపై ప్రత్యేక దృష్టి**
**ప్రభుత్వాలు మారినా క్రీడాప్రోత్సాహకాలు మారకూడదు**
**లిశాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**





**రేణిగుంట//మనప్రజాప్రతి నిధి** ఏపీ క్రీడారంగం అభివృద్ధే సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రధాన అజెండా అని, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ఆయన ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. రేణిగుంటలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-19 జూడో ఛాంపియన్‌షిప్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత స్థానిక నాయకులు, విద్యాశాఖాధికారులతో కలిసి ఆయన జ్యోతిప్రజల్వన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అంతర్జాతీయస్థాయిలో మన క్రీడాకారులు రాణించాలనేది సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ల సంకల్పమన్నారు. ప్రభుత్వాలు మారినా క్రీడాప్రోత్సాహకాలు మారకూడదని, దానివల్ల క్రీడాకారులు వెనకబడిపోతారని దిశానిర్దేశం చేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగంలో చేసిన ఘోర తప్పిదాలను సరిచేసుకుంటూ ఏపీ క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు శాప్ కృషి చేస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.12.70 కోట్ల క్రీడాప్రోత్సాహకాలను విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు.

**దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీ..**

దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించామని, అనేక అధ్యయనాల అనంతరం ఏపీ కేబినెట్‌లో స్పోర్ట్స్ పాలసీని సీఎం ఆమోదించారని వివరించారు. క్రీడారంగంలో ముందంజలో ఉన్న హర్యానా, గుజరాత్, ఒరిస్సా రాష్ట్రాలను సైతం తలదన్నేలా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఇటీవల ఏపీకి విచ్చేసిన కేంద్ర క్రీడాశాఖ సహాయమంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే కూడా ఏపీ స్పోర్ట్స్ పాలసీ పట్ల హర్షం వ్యక్తం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయస్థాయి పోటీల్లో రాణించేలా క్రీడాకారులను తయారుచేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. ఉద్యోగ కల్పనలో స్పోర్ట్స్ కోటా 2శాతం నుంచి 3శాతానికి పెంపు, నేషనల్స్‌లో మెడల్స్ గెలిచిన క్రీడాకారులకు యూనిఫాం ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంటు, కోచ్‌లుగా వారికి 50శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు.

**క్రీడల పట్ల విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టి..**

దేశంలోనే క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తున్న ఏకైక విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ అని, స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులను క్రీడలపై మొగ్గ చూపేలా ప్రతీ స్కూల్‌కు ఆటస్థలం ఉండాలని జీవో జారీ చేశారని అన్నారు. లోకేశ్ ఆదేశాలతో ఇప్పటికే నాణ్యమైన క్రీడాసామగ్రిని క్రీడాకారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. స్పోర్ట్స్ అథారిటీ, విద్యాశాఖ, పర్యాటకశాఖల సంయుక్త సహకారంతో ఏపీలో క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రీడాకారులకు వసతులు కల్పించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, క్రీడా ప్రోత్సాహకాలను అందించే విషయంలో వెనకాడేది లేదని స్పష్టం చేశారు. తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, పెండింగ్‌లో ఉన్న క్రీడావికాస కేంద్రాలు, మల్టీపర్పస్ స్టేడియంల పనులను వేగవంతం చేసి త్వరలోనే క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకుని పతకాలు సాధించాల్సిన బాధ్యత క్రీడాకారుల పై ఉందని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ముందు శాప్ ఛైర్మన్‌ను స్థానిక నాయకులు, విద్యాశాఖ అధికారులు, స్పోర్ట్స్ అసోసియేషన్ల నిర్వాహకులు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ సయ్యద్‌సాహెబ్, డీఐఈఓ విశ్వనాథ్, డీవైఈఓ బాలాజీ, హెచ్‌ఎం విష్ణువర్ధన్, ప్రతాప్‌రెడ్డి, జయరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ప్రజల మౌళిక సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

**ఇఫ్టూ(శ్రామిక స్పందన) జంటనగరాల కన్వీనర్ బడీగే వెంకటేష్ పిలుపు**
**ఐపిఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షతన జరిగిన స్థానిక అమరవ**






**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ జవహర్ నగర్** నవంబర్1 నుండి 30 వరకు గ్రామగ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు, సమావేశాలు నిర్వహించండని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో బాగంగా శనివారం రోజు మేడ్చల్, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థానిక అమరవీరుల సంస్మరణ సభ జరిగింది2006, సెప్టెంబర్-6న బాలాజీనగర్, మోహన్ రావు కాలనీకి చెందిన బండి రమణక్క(పిఓడబ్ల్యూ-స్త్రీ శక్తి మహిళా సంఘం) మరియు బండి గోపాల్, సెప్టెంబర్-22న పాల్వంచ భూటకపు ఎన్ కౌంటర్లో అడ్డగుట్టకు చెందిన మోజేషన్న(ఇఫ్టూ), 2014, ఏప్రిల్-1 చెన్నాపురం మల్లక్క(పిఓడబ్ల్యూ), 2015, అక్టోబర్-2 వికలాంగుల కాలనీకి చెందిన ఎన్.సుదర్శన్(ప్లాట్ల సాధన పోరాట కమిటీ), 2016, మార్చి-28 నందమూరి నగర్ చెందిన గడిపే కమలక్క(పిఓడబ్ల్యూ) మరియు అడ్డగుట్టకు చెందిన ప్రగతిశీల ఆటో కార్మిక యూనియన్ మైసయ్యల సంస్మరణ సభ జరిగింది. 2024, నవంబర్-23న ఐపిఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పెర్క సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ధక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్ ద్రావిడ, ఇఫ్టూ (శ్రామిక స్పందన) జాతీయ కార్యదర్శి షేక్ షావలి, జంటనగరాల కన్వీనర్ బడిగే వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల హక్కుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్క్ దుర్గాప్రసాద్ తదితరులు హాజరై ప్రసంగించారు. జవహర్ నగర్ ప్రాంతంలో అమరులు చూపిన దారిలో స్థానిక ప్రజల మౌళిక సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని బడిగే వెంకటేష్ పిలుపునిచ్చారు. మనిషిని మనిషి ప్రేమించే సమాజం కోసం, దోపిడీ, పీడన అణిచివేత, వివక్షత లేని సమసమాజ స్థాపనకోసం ఉద్య మించాలని కోరారు. అనంతరం సంతాప సూచికంగా రెండు నిముషాలు మౌనం పాటించి, అమరవీరులకు ఘనమైన విప్లవ నివాళులు అర్పించారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేయాలని, ఆదివాసి ప్రజలపై బస్తర్ ప్రాంతంలో జరుపుతున్న మానవ హననాన్ని వెంటనే ఆపి, కేంద్ర, రాష్ట్ర మిలటరీ, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని, మరియు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, డంపింగ్ యార్డు వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ పలు తీర్మానాలు చేశారు. యమునా, సరిత, రమేష్, కుమ్మరి మైసయ్య తదితరులు ఈపై కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సంస్కృత విశ్వ విద్యాలయం లో వచ్చిన ఆరోపణల పై - యాంటీ డ్రగ్ కమిటీ...



**ప్రజా ప్రతినిధి నేర విభాగం తిరుపతి జిల్లా.** తిరుపతి, సంస్కృత విశ్వ విద్యాలయం లో ముగ్గురు విద్యార్థులు గంజాయి సేవించినారని మీడియా లో వస్తున్న కధనాలు, తిరుపతి ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు, ఈ సంఘటన కు సంబంధించి విశ్వవిద్యాలయం విసి,రిజిస్టర్ అధికారులను పోలీసు వారు వివరణ కోరగా, అధికారులు స్పందిస్తూ విశ్వ విద్యాలయం లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న ఒక ఒరిస్సా విధ్యార్థి, తన సొంత రాష్ట్రం ఒరిస్సా నుండి తిరుపతి విశ్వ విద్యాలయమునకు వచ్చినప్పుడు స్వల్ప మోతాదులో గంజాయి తెచ్చుకొని, ఇద్దరు తన స్నేహితులతో కలిసి గంజాయి సేవించినట్లు ఆరోపణలు ఉన్నట్లు చెప్పారు. అందులో భాగంగా పోలీస్ వారు విచారణ నిమిత్తం విశ్వ విద్యాలయం లో యాంటీ ట్రక్ కమిటీ వేసినట్లు మీడియా వారికి చెప్పినారు. సదరు విచారణ రిపోర్ట్ పై విశ్వ విద్యాలయం అధికారులు తెలియజేసిన యెడల, దాని పై లోతుగా దర్యాప్తు చేసి చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటాము. విశ్వ విద్యాలయం మరియు పాఠశాల అధికారులతో పోలీసు వారు మరింత ఎక్కువ అవగాహన కార్యక్రమాలు చేపడతామని, ఇటువంటివి పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకుంటామని తెలియజేయడమైనది.

# హాస్టల్స్ స్టోర్ రూమ్ లలో చేయాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు అందించాలి




**మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజసంక్షేమ హాస్టల్లో చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించిన అదనపు కలెక్టర్లిఖమ్మం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టల్స్ లలో స్టోర్ రూమ్ లలో చేయవలసిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సంక్షేమ హాస్టల్లో చేయాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,లి కేజీబీవీలలో సరుకులు స్టోర్ చేసేందుకు అవసరమైన ర్యాక్, సామాగ్రి ఏర్పాటు చేసుకోవాలని, కేజీబీవిల దగ్గర అందుబాటులో ఉన్న నిధులతో ఈ వసతులు కల్పించాలని, డిసెంబర్ 25 నాటికి పనులు పూర్తి చేసి ఫోటోలు సమర్పించాలని తెలిపారు. రెసిడెన్షియల్ హాస్టల్స్ లలో సరుకులు స్టోర్ చేసుకునేందుకు అవసరమైన స్టాండ్స్, స్టోర్ రూమ్ లలో కావాల్సిన సదుపాయాల ప్రతిపాదనలు సమర్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు.రెసిడెన్షియల్ హాస్టల్స్ , కేజీబీవిలలో ఫిల్టర్ త్రాగునీటి కోసం మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సెడిమెంట్ ఫిల్టర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని, వీటికి అవసరమైన నిధులు విడుదల చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ నెలలో హాస్టల్స్, కేజీబీవీ లలో స్టోర్ రూమ్, ఫిల్టర్ల సౌకర్యం ఏర్పాటు కావాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మైనారిటీ సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, బీసీ అభివృద్ధి అధికారి జి. జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా రివార్డులను అందుకున్న జిల్లా అధికారులు





**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక కొత్తగూడెం జిల్లాభద్రాద్రి** కొత్తగూడెం ఎస్పీ కార్యాలయం గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన అధికారులను ప్రశంసించిన రాష్ట్ర డీజిపి డా. జితేందర్ ఐపిఎస్లిభద్రాచలం పోలీస్ స్టేషన్లో గంజాయి అక్రమ రవాణా కేసుల్లోని నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన సీఐ నాగరాజు రెడ్డి,ఎస్సై శ్రీకాంత్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుధీర్ లకు ఈ రోజు రాష్ట్ర డీజిపి డా.జితేందర్ ఐపిఎస్ తమ కార్యాలయంలో రివార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి చేతుల మీదుగా అరువార్డులను అందుకున్న అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.2023 సంవత్సరంలో ప్రభుత్వం నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేవిధంగా కృషి చేసిన అప్పటి ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి,ఎస్సై శ్రీకాంత్ మరియు కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుదీర్ లు ఈరోజు డీజీపీ కార్యాలయంలో రివార్డులను అందుకున్నారు. క్రైమ్ నెంబర్.169/2023, భద్రాచలం పిఎస్ లో 480 కిలోల నిషేధిత గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలకు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా మరియు క్రైమ్ నెంబర్ 198/2023, భద్రాచలం పిఎస్ లో 484 కిలోల నిషేధిత గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలకు 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా పడేవిధంగా కోర్టు వారికి సాక్షాధారాలను సమర్పించి సమర్థవంతంగా పనిచేసినందుకు గాను వీరి ప్రతిభను గుర్తించి ఇట్టి రివార్డులను అందజేయడం జరిగింది. వీరి ముగ్గురితో పాటు నేరస్తులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయకుమార్‌ని కూడా జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.